క్లుప్తంగా

వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ కుటుంబాలు



పార్టీలోకి ఆహ్వానిస్తున్న హనిమిరెడ్డి

సంతమాగులూరు (అద్దంకి రూరల్): మండలంలోని మక్కెనవారిపాలెం గ్రామంలో 15 టీడీపీ కుటుంబాలు ఆపార్టీని వీడి వైఎస్సార్ సీపీలో చేరారు. ఆదివారం «పల్లె పల్లెకు హనిమిరెడ్డి» కార్యక్రమంలో నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త పానెం చిన హనిమిరెడ్డి ఆధర్యంలో చేరారు. టీడీపీ నాయకులకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి గారి విగ్రహానికి పూలమాలలతో నివాళులర్పించారు. అనంతరం గ్రామంలో టీడీపీ నేత మందా ప్రభాకర్ ఆధ్వర్యంలో చేరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ, వైస్ ఎంపీపీలు, మండల పార్టీ కన్వీనర్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, సోషల్ మీడియా మిత్రులు, వివిధ హోదాలలో ఉన్న వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

వేమవరంలో రేపు జేఏఎస్ క్యాంపు

బల్లికురవ: జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత క్యాంపు మంగళవారం ఉదయం 9 గంటల నుంచి వేమవరం గ్రామంలో నిర్వహిస్తున్నట్లు గుంటుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి షేక్ రమీజ్ అహమ్మద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రోగులు శిబిరానికి వచ్చి పరీక్షలతో పాటు వైద్యులను సంప్రదించి చూపించుకోవచ్చని వైద్యాధికారి కోరారు.

కొడవలివారిపాలెంలో నేత్రదానం

ఇంకొల్లు (చినగంజాం): మండలంలోని కొడవలివారిపాలెం గ్రామానికి చెందిన కొసరాజు రుషికేశవ వెంకట సుబ్బారావు(83) ఆదివారం మృతి చెందడంతో ఆయన కుటుంబ సభ్యులు నేత్రాలను దానం చేశారు. మృతుని భార్య శ్రీదేవి, కుమార్తెలు కొడాలి కుచ్చల రాగ మంజరి, ఆలపాటి పద్మజ, కొనగంటి మాధవీలతలు దాత కార్నియాలను ఇచ్చేందుకు రోటరీ క్లబ్ ఆఫ్ ఇంకొల్లు సెంట్రల్ అవయవదాన కమిటీ సభ్యులు జెట్టి వెంకటేశ్వర్లు, సోమేపల్లి రామ్మోహనరావులకు తెలియజేశారు. గుంటూరు శంకర్ కంటి వైద్యశాల వైద్యులు దాత కార్నియాలను సేకరించారు. కుటుంబ సభ్యులకు కమిటీ సభ్యులతో పాటు రోటరీ క్లబ్ అధ్యక్ష, కోశాధికారి కరికమలేశ్వరరావు, చుండి సాంబశివరావు, రోటరీ సభ్యులు దాత కుటుంబ సభ్యులకు అభినందనలు తెలియజేశారు.

వాసవీ స్మార్ట్ క్లబ్ అధ్యక్షుడిగా సాయి

వేటపాలెం: వాసవీ స్మార్ట్ క్లబ్ నూతన అధ్యక్షుడుగా నూకల సాయి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక వాసవీ కన్యకామపరమేశ్వరి అమ్మవారి దేవస్థానం ప్రాంగణలో వాసవీ క్లబ్ సమావేశం ఆదివారం నిర్వహించారు. సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా కొణిజేటి రంగనాథ్ గుప్త, కోశాధికారిగా పెనుగొండ విజయ్ ఎన్నికయ్యారు. వాసవీ క్లబ్స్ ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ కనమర్లపూడి హరిప్రసాద్ ఎన్నికలను పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్లు దోగిపర్తి బాలకృష్ణ, చుండూరి సురేష్, చేబ్రోలు సురేష్, అనురాధ, సతీష్, రామలింగం పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో చిన్నారుల ప్రతిభ



వేటపాలెం: రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో వేటపాలెం లిటిల్ స్కాలర్ స్కూల్ విద్యార్థులు బంగారు పతకా లు సాధించారు. ఆదివారం గుంటూరు, బాపట్ల జిల్లా ల్లో మార్షల్ ఆర్ట్స్ అకాడమీ వారి ఆధ్వర్యంలో కరాటే పోటీలు నిర్వహించారు. పోటీల్లో లిటిల్ స్కాలర్ స్కూల్ విద్యార్థులు బాలురుల కటాస్ విభాగంలో జాన్ రోనాల్డ్, బి వెంకట సాయి చరణ్, జీ సాద్విక్ ముగ్గురు బంగారు పతకాలు సాధించగా, కుమితే విభాగంలో అజయ్ శ్రీరాం, చరణ్ వెండి పతకాలు సాధించారు. టీం కటాలో కే హేమంత్ సాయి, ఎం షాన్ ప్రకాష్, ఎస్ చైతన్య బంగారు పతకాలు సాధించగా అదే విభాగంలో పి సుజిత్, వెంకటసాయి, ఎస్ పార్థసారథి, కే కార్తికేయ, వి హితేష్ కాంస్య పతకాలు సాధించారు. ఎస్ వరుణ్‌సాయి వెండి పతకం సాధించాడు. బాలికల విభాగంలో వీ పరిణితి కాంస్య పథకం సాధించింది. విద్యార్థులను కోచ్ మాస్టర్ వి బ్రహ్మనాయుడు, స్కూల్ డైరెక్టర్ ఎస్ వెంకటేశ్వర్లు అభినందించారు.

రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

పర్చూరు (చినగంజాం): పర్చూరు, ఇంకొల్లు, కారంచేడు, యద్దనపూడి మండలాల్లోని వ్యాపార సంస్థలను స్థానిక కార్మిక శాఖలో తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని పర్చూరు సహాయ కార్మికశాఖ అధికారి ఆర్ అబ్రహాం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఇటీవల దుకాణ యజమానులకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. ఈ నెల 29 తేదీలోపు రిజిస్ట్రేషన్ చేయించుకొని తగిన సర్టిఫికెట్ పొందాలని ఆయన కోరారు.

అభివృద్ధి దిశగా శ్మశానవాటిక



దహనయంత్రం కోసం నూతనంగా నిర్మించిన భవనం



మృతదేహాలను ఖననం చేసేందుకు ఏర్పాటు చేసిన దహన యంత్రం



100 అడుగుల పొడవుతో ఏర్పాటు చేసిన చిమ్నీ

- హిందు శ్మశానవాటికలో దహన యంత్రం ఏర్పాటు
- రూ.1.20 కోట్లతో నూతన భవనం, యంత్రాలు
- పది రోజుల్లో అందుబాటులోకి సేవలు
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు

చీరాల రూరల్: చావు కూడా పండుగలాంటిదే. జీవితాంతం ఎన్నో కష్టాలు, నష్టాలు చూసి చివరిగా కన్నుమూసినప్పుడు ప్రశాంతంగా శ్మశానికి వెళ్తుంటాడు జీవి. కాని శ్మశానంలో ఆరడగుల నేల దొరక్క ఇబ్బందులు పడుతున్నారు. కరోనా మహమ్మారి సమయంలో అయితే ఈబాధ వర్ణణాతీతం. వివిధ కారణాలతో మృతిచెందిన వారిని దహనం చేయాలంటే చాలా ఇబ్బందులు ఉండేవి. కాని ఈప్రభుత్వంలో కొత్త సాంకేతికతతో దహన యంత్రాలను తీసుకువచ్చింది. సులభంగా మృతదేహాన్ని దహనం చేసి బంధువులకు ఇబ్బందులు లేకుండా చేసింది. మృతి చెందిన మానవ శరీరాన్ని ఖననం చేయాలంటే ఎంతో శ్రమతో కూడిన కార్యం. మృతదేహాన్ని ఖననం చేయడానికి వావాల్సిన కట్టెపుల్లలు పోగుచేయడం, ఖననం అయ్యే వరకు మృత దేహం దగ్గరుండి పూర్తిగా ఖననం చేసే వరకు సంబంధిత బంధువులు శ్మశానంలో కాపలా ఉండాలి. ఈ తతంగమంతా కొన్ని గంటల వరకు జరుగుతుంది. ఒక్కో సమయంలో అంటే వర్షాలు పడే సమయంలో అయితే మృతదేహాలు పూర్తిగా కూడా కాలవు. ఆ సమయంలో మృత దేహానికి సంబంధంచిన వారు ఎంతో వేదన చెందుతారు. మృతదేహాలు పూర్తిగా కాలకపోతే అరిష్టమని, ఆత్మలు శాంతించవని కొందరు చెబుతుంటారు. అంతేకాక మృత దేహాలు కాలే సమయంలో చుట్టు పక్కల నివాలుంటున్న ప్రజానీకం భరించరాని వాసన పీల్చాలి. కానీ ఇక నుంచి అటువంటి సమస్యలు ఏమి ఉండవు ఆయా సమస్యల పరిష్కారానికి అధికారులు చెక్ పెట్టనున్నారు. హిందు శ్మశాన వాటికలో మృతదేహాల దహన యంత్రాన్ని ఆవిష్కరించనున్నారు. మృతదేహాన్ని దహన యంత్రంలో వేసిన గంటకే మృత దేహం పూర్తిగా ఖననం అయిపోతుంది. ఎటువంటి దార్వాసనలు బయటకు రావు. దేహం పూర్తిగా కాలిన తరువాత కావాల్సిన వారికి దేహం తాలూకు బూడిద కూడా అందిస్తారు. అందుకుగాను గ్యాస్ ఆధారిత యంత్రాన్ని ఉపయోగించనున్నారు. పది రోజుల్లో దహనయంత్రం సేవలు అందుబాటులోకి రానున్నాయి.

13 ఎకరాల్లో దహన యంత్రం..

కారంచేడు రోడ్డులోని హిందు స్మశాన వాటిక ఎంతో సువిశాలమైన ప్రదేశం. సుమారుగా 13 ఎకరాలకుపైగానే చుట్టు కొలత ఉంటుంది. మృత దేహాలను ఖననం చేసేందుకు ఈ శ్మశానవాటికలో అన్ని సౌకర్యాలున్నాయి. ఎంతో అనువైన ఈ ప్రదేశంలో పట్టణంలోని అన్ని ప్రాంతాలకు చెందిన హిందువులు మృత దేహాలను ఖననం చేసేందుకు శ్మశాన వాటికను ఉపయోగించుకుంటారు. మృత దేహాలను ఖననం చేసేందుకు ఎంతో శ్రమను వెచ్చిస్తుంటారు. ప్రస్తుతం ఏర్పాటు చేయనున్న దహన యంత్రంతో సమస్యలన్నీ మటుమాయం అవుతాయి.

14వ ఆర్థిక సంఘం నిధులతో..

దహన యంత్రం ఆవిష్కరణకు స్థానిక ఎమ్మెల్యే కరణం బలరామ కృష్ణమూర్తి సహకారంతో 14వ ఆర్థిక సంఘం నిధులు రూ.1.20 కోట్లు కేటాయించారు. రెండేళ్ల క్రితం పనులు ప్రారంభించారు. యంత్రాన్ని అమర్చే భవనం పూర్తిచేశారు. భవనం చుట్టూ వాహనాలు తిరగటానికి వీలుగా సిమెంట్ రోడ్లు, మంచినీటి పైపులు ఏర్పాటు వంటి మౌలిక వసతులకు రూ.80 లక్షలు ఖర్చు చేశారు. రూ. 60 లక్షలతో దహన యంత్రం పరికరాలను చెన్నైలో కొనుగోలు చేశారు. యంత్ర పరికాలన్నింటిని నెల రోజులుగా చెన్నైకు చెందిన నిపుణులు పూర్తి చేశారు. మృత దేహాన్ని ఖననం చేసేందుకు సమారుగా 750 డిగ్రీల ఉష్ణోగ్రతను అందిస్తారు. దేహం కాలడానికి గంట సమయం పడుతుంది. ఒక మృత దేహాన్ని ఖననం చేసేందుకు 10 కేజీల ఎల్‌పీజీ గ్యాస్ ఉపయోగిస్తారు. దేహాన్ని కాల్చే సమయంలో చుట్టుపక్కల నివాసముంటున్న జనాలకు ఎటువంటి ఇబ్బందులు ఉండవు. ఇందుకుగాను పొగను బయటకు పంపించేందుకు భవనం పక్కనే 100 అడుగుల పొడవుతో భారీ చిమ్నీ ఏర్పాటు చేశారు. దీని వలన ఎటువంటి ఇబ్బదులు లేకుండా పొగ పైకి వెళ్లిపోతుంది. అంతేగాక పర్యావరణానికి ఎటువంటి నష్టం జరగదు.

> **పదిరోజుల్లో అందుబాటులోకి..**
> పదిరోజుల్లో పనులన్నింటిని పూర్తిచేసి దహన యంత్ర సేవలను అందుబాటులోకి తీసుకువస్తాం. ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి చెప్పిన విధంగానే నాణ్యత విషయంలో ఎక్కడా రాజీపడకుండా పనులన్నింటినీ పూర్తి చేశాం. అనేకసార్లు పనులన్నింటిని ఎమ్మెల్యే పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. యంత్ర పనుల అమరికలన్నీ పూర్తయ్యాయి. మృతదేహాల ఖననానికి అయ్యే ఖర్చు కరెంటు బిల్లులు, ఆపరేటర్‌కు జీతం, ఇతర ఖర్చులు వంటివాటిని వసూలు చేసేందుకు కౌన్సిల్ సమావేశంలో చర్చిస్తాం. నామమాత్రంగా రేటు నిర్ణయించి నగదు వసూలు చేసే విధంగా చర్యలు తీసుకుంటాం.
> – ఏసయ్య, చీరాల మున్సిపల్ డీఈ

వైద్య శిబిరాల ఏర్పాటు అభినందనీయం



ఇంకొల్లులో పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్



చీరాలలో రోగులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు



సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ శ్రీకాంత్

చీరాల రూరల్/చీరాల అర్బన్: వైద్య శిబిరాల ఏర్పాటు అభినందనీయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఇంటర్నేషనల్ వాకర్స్ ఎస్ఆర్అండ్ పీఎం చీరాల వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గుంటూరు ఎండో లైఫ్ హాస్పిటల్, కొనాక్ డయాగ్నోస్టిక్స్ సహకారంతో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. ఉదయం ప్రారంభించిన వైద్య శిబిరం మధ్యాహ్నం వరకు కొనసాగింది. శిబిరంలో డయాబెటిస్, బీపీ, వంటి ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. 30 మంది రోగులకు వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించారు. సేవా కార్యక్రమంలో భాగంగా హరిప్రసాద్ నగర్‌లోని కోటయ్య అనాథ వృద్ధాశ్రమానికి బియ్యం అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పోలుదాసు రామకృష్ణ, చారుగుళ్ల గురుప్రసాద్, ట్రెజరర్ గొడవర్తి సుధాకర్, సభ్యులు పాల్గొన్నారు.

వైద్య పరీక్షలతోనే వ్యాధి నిర్ధారణ..

చీరాల అర్బన్: 60 ఏళ్ల పైబడిన వారందరూ డాక్టర్లు సూచించిన వైద్యపరీక్షలు విధిగా చేయించుకోవాలని రేడియాలజిస్ట్ డాక్టర్ పి.శ్రీకాంత్ అన్నారు. ఆదివారం సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ చీరాల శాఖ ఆధ్వర్యంలో ఆరోగ్య సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ పి.శ్రీకాంత్ మాట్లాడుతూ షుగర్, కీళ్ల నొప్పులు, గుండెపోటు, మలబద్ధకం వంటి వాటికి డాక్టర్ల సూచనల మేరకు వైద్యపరీక్షలు చేయించుకోవాలన్నారు. సదస్సుకు అసోసియేషన్ అధ్యక్షులు గాదె హరిహరరావు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో బాపట్ల జిల్లా సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షులు జి.వీరబ్రహ్మం, సింహాద్రి యల్లమందారెడ్డి, కోటేశ్వరరావు, నాగేశ్వరరావు, మునీరుల్లాఖాన్, వి.జగన్మోహనరావు, ఐతా రవీంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంకొల్లులో 200 మందికి గుండె వైద్య పరీక్షలు..

ఇంకొల్లు (చినగంజాం): రోటరీ క్లబ్ ఆఫ్ ఇంకొల్లు సెంట్రల్ ఆధ్వర్యంలో విజయవాడ హెల్ప్ హాస్పిటల్స్ వారిచే ఆదివారం ఉచిత గుండె వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఇంకొల్లులోని ఎస్ఆర్ అండ్ వీఎస్ఆర్ బాలికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరంలో సుమారు 200 మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. రోటరీ క్లబ్ అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని క్లబ్ అధ్యక్షులు కరికమలేశ్వరరావు తెలిపారు. డాక్టర్ ఆలా శ్రీకృష్ణమూర్తి ఎకో విభాగంను, ఈసీజీ విభాగంను డాక్టర్ జ్వాలా సాయి ప్రారంభించారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి జెట్టి వెంకటేశ్వర్లు(స్వామి), కోశాధికారి చుండి సాంబశివరావు, మద్దినేని హనుమంతరావు, వీ ఆంజనేయులు, సోమేపల్లి రామ్మోహనరావు, భవనం అంజిరెడ్డి, అలవల రాఘవరెడ్డి పాల్గొన్నారు.

నిస్వార్థ సంగీత సేవకులు 'పోరూరి'



కార్యక్రమంలో మాట్లాడుతున్న వక్తలు

చీరాల అర్బన్: అంకితభావంతో నిస్వార్థంగా సంగీత సేవ చేసిన నిగర్వి పోరూరి లక్ష్మీనరసింహారావు అని పలువురు వక్తలు కొనియాడారు. చైతన్య భారతి ఆధ్వర్యంలో సంగీత సద్గురు త్యాగరాజ స్వామి ఆరాధనోత్సవాలు ఘనంగా నిర్వహించారు. చైతన్యభారతి, శ్రీవాణి కళానికేతనం సంయుక్త ఆధ్వర్యంలో పోరూరి లక్ష్మీనరసింహారావు 23వ సంస్మరణోత్సవాన్ని ఎస్‌వీఎస్ఎస్‌జెఆర్ కళ్యాణ మండపంలో ఊటుకూరి వెంకటరావు అధ్యక్షతన ఆదివారం రాత్రి నిర్వహించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ పోరూరి లక్ష్మీనరసింహారావు ఎప్పుడూ వ్యాపారాత్మక దృష్టితో ఆలోచించకుండా చీరాల, పరిసర ప్రాంత సాంస్కృతిక సేవా సంస్థలకు వెన్నుముకగా నిలిచారన్నారు. ముఖ్యఅతిథిగా హాజరైన స్వర్ణ ప్రయాగరావు మాట్లాడుతూ సంగీత బోధన చేసే సమయంలో ఎక్కడా రాజీ పడేవారు కాదని, ఆంధ్రదేశంలో మొదటి పది మంది ఉత్తమ సంగీత విద్వాంసులలో పోరూరి ఒకరని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాలపర్తి ఆంజనేయశాస్త్రి, చైతన్య భారతి అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ సూర్యదేవర ఉమామోహన్, భాగి నారాయణశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత క్యాన్సర్ శిబిరం విజయవంతం

చీరాల అర్బన్: ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా ఆదివారం స్థానిక మసీదు సెంటర్‌లోని ప్రాణహిత హాస్పిటల్, క్యాన్సర్ సెంటర్‌లో ఉచిత నిర్ధారణ పరీక్షలు, అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. శిబిరంలో కన్సల్టెంట్ క్యాన్సర్ స్పెషలిస్ట్ డాక్టర్ శివాని పరీక్షలు నిర్వహించారు. అలానే ప్రజలలో కాన్సర్ వ్యాధి నివారణ, సాధారణ క్యాన్సర్లను గుర్తించడంపై అవగాహన సదస్సును నిర్వహించారు. క్లినికల్ బ్రెస్ట్ పరీక్షలు, నోటి పరీక్షలు నిర్వహించారు. చీరాలలో క్యాన్సర్ హాస్పిటల్ లేకపోవడంతో గుంటూరు, విజయవాడ, హైదరాబాద్ ప్రాంతాలకు వెళ్లేవారని, ప్రాణహిత హాస్పిటల్‌లో క్యాన్సర్ వైద్యాన్ని ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ జి.పృథ్వీ, గైనకాలజిస్ట్ షణ్ముఖిశ్రీ తదితరులు పాల్గొన్నారు.

ప్రచారక్ కమిటీ సభ్యుడిగా హరిబాబు



దీ శ్రావణ్‌కుమార్



ధర్మవరపు హరిబాబు

అద్దంకి: దక్షిణ భారత్ హిందీ ప్రచారక్ మండల్ కమిటీలో అద్దంకి పట్టణానికి చెందిన ధర్మవరపు హరిబాబుకు స్థానం దక్కింది. ఈ మేరకు ఆయనకు ఆదివారం ప్రచారక్ మండలి నుంచి ఉత్తర్వులు వెలవరించారు. అదే విధంగా ట్రస్ట్ బోర్డు కమిటీ సభ్యులుగా హిందీ ఉపాధ్యాయులు దర్మవరపు శ్రావణ్‌కుమార్ ఎన్నికయ్యారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



రౌడీ షీటర్‌లతో మాట్లాడుతున్న ఎస్సై

బల్లికురవ: రౌడీ షీటర్‌లు సత్ప్రవర్తనతో మెలగాలని ఎస్సై శివ నాగిరెడ్డి కోరారు. ఆదివారం సాయంత్రం స్థానిక పోలీస్ స్టేషన్‌లో గ్రామాల వారీగా రౌడీ షీటర్లతో ఆయన మాట్లాడారు. త్వరలో జరిగే ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు సహకరించాలన్నారు. అల్లర్లు, అలజడులకు పాల్పడితే ఎంతటి వారిపైనైనా కేసులు నమోదు చేస్తామని ఎస్సై హెచ్చరించారు. మంచిగా మెలిగే వారికి వయస్సును దృష్టిలో ఉంచుకుని రౌడీ షీట్ ఎత్తివేసేలా ఉన్నతస్థాయి అధికారులకు నివేదిస్తామని వివరించారు.

ప్రతి విద్యార్థిలోనూ ఒక కళ ఉంటుంది



బహుతులను అందజేస్తున్న సమన్వయకర్త హనిమిరెడ్డి

అద్దంకి: విద్యతోపాటు విద్యార్థులు ఆటలు కరాటే, స్కేటింగ్ రోలింగ్ వంటి వాటికి ప్రాధాన్యత ఇవ్వాలని వైఎస్సార్ సీపీ అద్దంకి నియోజకవర్గ ఇన్‌చార్జి పానెం చిన హనిమిరెడ్డి అన్నారు. స్థానిక మార్కెట్ యార్డు ఆవరణలో ఆదివారం నిర్వహిచిన రోలర్ స్పోర్ట్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విజేతలుగా నిలిచిన చిన్నారుకు బహుంతులు అందజేశారు. ఈసందర్భంగా సమన్వయకర్త మాట్లాడుతూ ప్రతి విద్యార్థిలోనూ ఏదో ఒక కళ ఉంటుందన్నారు. దాన్ని తల్లిదండ్రులు, గురువులు గుర్తించి మెరుగులు పెడితే వారు ఆయా రంగాల్లో ప్రఖ్యాతి చెందుతారని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు కాకాని రాధాకృష్ణమూర్తి, మున్సిపల్ వైస్ చైర్మన్ దేశు పద్మేశ్, కౌన్సిలర్ కే సుధీర్, వార్డు ఇన్‌చార్జి ఊడత్తు సురేశ్, వివిధ హోదాల్లో ఉన్న నాయకులు, రోలర్ స్పోర్ట్స్ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీకి పెరుగుతున్న ఆదరణ



ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందిస్తున్న మున్సిపల్ కౌన్సిలర్ సత్యానందం

- ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి

చీరాల: వైఎస్సార్ సీపీకి రోజు రోజుకు ఆదరణ పెరుగుతోందని ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి అన్నారు. చాలా కాలంగా పార్టీకి దూరంగా ఉన్న పలువురు ఆదివారం వైఎస్సార్ సీపీకి మద్దతు తెలిపారు. పట్టణంలోని 31వ వార్డు కౌన్సిలర్ ఎస్. సత్యానందంతో పాటు పైడి రాజేష్, గరికపాటి సుధీర్‌లు ఎమ్మెల్యేను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సాగిస్తున్న సంక్షేమ పాలనతో ప్రజలందరూ సంతోషంగా ఉన్నారన్నారు. అర్హులందరికి సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయన్నారు. అన్ని వర్గాలకు అర్హతే ప్రమాణికంగా రాజకీయాలకు అతీతంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. పలువురు మాట్లాడుతూ చీరాలలో కరణం వెంకటేష్‌కు గెలిపించుకునేందుకు తమ వంతు కృషి చేస్తామన్నారు. రానున్న ఎన్నికలలో చీరాలలో వైఎస్సార్‌సీపీ గెలుపు జెండా ఎగరడం ఖాయమన్నారు. పార్టీ విజయానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, పార్టీ అధ్యక్షులు కొండ్రు బాబ్జి, కౌన్సిలర్ కె.యానాదిరావు, జెసిఎస్ ఇన్‌చార్జి కోలా శివ, వాసిమల్ల శ్రీను, వాసు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ ఎన్నికల ప్రచార పోస్టర్ ఆవిష్కరణ



ఎన్నికల పోస్టర్ ఆవిష్కరిస్తున్న సమన్వయకర్త చిన హనిమిరెడ్డి

అద్దంకి రూరల్: టీమ్ పీహెచ్ఆర్ ఆధ్వర్యంలో రూపొందించిన అద్దంకి వైఎస్సార్ సీపీ ఎన్నికల ప్రచార పోస్టర్‌ను ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త పానెం చిన హనిమిరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనను నియోజకవర్గ ప్రజలు కుటుంబ సభ్యుడిగా ఆదరిస్తున్నారన్నారు. అదేవిధంగా ఎన్నికల్లో సీఎం జగన్ మోహన్‌రెడ్డికి అండగా నిలిచి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక నాయకుడు అవిశెన ప్రభాకరరెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాలనీ వాసుల సమస్యలు తీర్చిన హనిమిరెడ్డి..



కాలనీ వాసులతో మాట్లాడుతున్న హనిమిరెడ్డి

మండలంలోని శింగరకొండ గ్రామంలో కనకదుర్గమ్మ ఆలయం సమీపంలో ఉంటున్న కాలనీ వాసులు సమస్యలను హనిమిరెడ్డి తీర్చారు. ఆదివారం కాలనీ వాసులు పార్టీ కార్యాలయంలో హనిమిరెడ్డిని కలిసి సమస్యలను వివరించారు. తక్షణమే స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడి కాలనీ వాసుల సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో శింగరకొండ పాలెం సర్పంచ్ ఎర్రిబోయిన తిరుపతయ్య, స్థానిక నాయకుడు అవిశెన ప్రభాకరరెడ్డి ఉన్నారు.

హనిమిరెడ్డిని కలిసిన రాష్ట్ర ప్రైవేట్ స్కూల్స్ ఉపాధ్యక్షుడు

రాష్ట్ర ప్రవేటు స్కూల్స్ ఉపాధ్యక్షుడు, విక్టరీ హైస్కూల్ కరస్పాండెంట్ (రైల్వే కోడూరు) అవిశెన నరసింహారెడ్డి ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో హనిమిరెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి దుశ్శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పక్కాగా పేదల ఇళ్లస్థలాల రిజిస్ట్రేషన్



యద్దనపూడిలో సిబ్బందితో మాట్లాడుతున్న ఆర్డీవో రవీందర్

యద్దనపూడి: పేదలందరికీ ఇళ్లు పథకం కింద ప్రభుత్వం కేటాయించిన ఇళ్ల స్థలాలు పేదల పేరున పక్కాగా రిజిస్ట్రేషన్లు చేయాలని బాపట్ల ఆర్డీఓ జి. రవీందర్ అన్నారు. ఆదివారం స్థానిక తహశీల్దారు కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల వారీగా ప్రతి సచివాలయంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. ఈనెల 10వ తేదిలోగా రిజిస్ట్రేషన్లు పూర్తి కావాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ తహశీల్దారు విష్ణుప్రసాద్, వీఆర్వోలు, పాల్గొన్నారు.

మార్టూరు: ప్రభుత్వం జగనన్న లేఅవుట్ల ద్వారా లబ్ధిదారులకు పంపిణీ చేసిన ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్లు ఈనెల 9వ తేదీలోపు పూర్తి చేయాలని బాపట్ల ఆర్డీవో గంధం రవీందర్ అధికారులను ఆదేశించారు. స్థానిక సచివాలయం 1లో ఆదివారం మధ్యాహ్నం అధికారులు సిబ్బందితో ఆయన మాట్లాడారు. అధికారులు సమయపాలన తప్పనిసరిగా పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో నితిన్, డీటీ శివ శ్రీను, పంచాయతీ కార్యదర్శులు తన్నీరు శ్రీనివాసరావు, మీరావలి, వీఆర్వో ప్రసన్న సచివాలయ సిబ్బంది లబ్ధిదారులు పాల్గొన్నారు.

బహిరంగ వేలం ప్రకటన

గ్రామ పంచాయితీ కార్యాలయము, నాగరాజుపల్లి.

ROC NO. 07/2022-23 తేది: 04-02-2024

బాపట్ల జిల్లా, మార్టూరు మండలం, నాగరాజుపల్లి గ్రామ పంచాయితీకి చెందిన రాజుపాలెం మైనర్ ఇరిగేషన్ చెరువు నందు చేప పిల్లలు వేసి పెంచి పట్టుకొనుటకు లీజ్ హక్కును 1433 మరియు 1434 ఫసలికి (2023-24, 2024-25 సంవత్సరము) గాను, బహిరంగ వేలం పాట నాగరాజుపల్లి గ్రామ పంచాయితీ కార్యాలయము వద్ద తేది.12-02-2024 ఉదయం 11-00 గంటలకు జరుగును.

షరతులు:- 1. బహిరంగ వేలములో పాల్గొనదలచిన వారు ధరావత్తు సైకము రూ.50,000/- (అక్షరముల యాభై వేల రూపాయలు).

2. బహిరంగ వేలము షరతులు, మిగతా వివరములు నాగరాజు పల్లి గ్రామ పంచాయితీ కార్యాలయము పనిచేయు వేళలలో తెలుసుకొనవచ్చును.

డి.మురళీకృష్ణరావు, పంచాయితీ కార్యదర్శి,
గ్రామ పంచాయితీ, నాగరాజుపల్లి. సెల్: 99892 47850